"మోడ్రన్ డ్రస్ ఫేక్టరీలో పనిచేసే వల్లభరావు తప్ప ఈ వూళ్ళో ఇంకెవరూ లేరు నాకు." చెప్పాడు రంగనాథ్.

"వల్లభరావెవరు?"

రైల్లో జరిగిందంతా చెప్పాడతను.

అతను చిన్నగా నవ్వి రంగనాథ్‌ని తన గదిలోకి ఆహ్వానించాడు. మర్నాడు అతన్ని తను పని చేసే ఫేక్టరీకి తీసుకెళ్ళాడు. రంగనాథ్‌ని మేనేజర్‌కి సహాయకుడిగా తీసుకున్నాడు అతను.

రంగనాథ్ పడుకున్నది హైద్రాబాద్‌లోని కొన్ని లక్షల ఇళ్ళల్లో ఒకటైన వల్లభరావు ఇంటి ముందే అని ఈపాటికి అర్థమై ఉండవచ్చు!

లోకంలో ఏదీ కాకతాళీయంగా జరగదు. తనని నమ్ముకున్నవారికి దేవుడు చేసే సహాయానికి మనం పెట్టుకున్న పేరు కాకతాళీయం.

## 12. నిజమైన నమ్మకం

ఓ దేశంలో రెండేళ్ళుగా వర్షాలు లేవు. మూడో ఏడు కూడా వర్షాలు కురవక క్షామం ఏర్పడింది. ఆ దేశపు రాజు మంత్రులని పిలిచి వర్షాలు కురవడానికి ఏంచేయాలా అని ఆలోచించి, తమ దేశంలోని ఓ పెద్ద పీఠాధిపతి వద్దకి వెళ్ళి తమ సమస్యని విన్నవించుకున్నాడు. ఆయన కొద్దిసేపు ధ్యానంలోకి వెళ్ళొచ్చాక చెప్పాడు.

"మన దేశంలోని ప్రజలకి దైవంమీద నమ్మకం తగ్గడం వల్లనే ఇలా జరుగుతోంది. అంతా దైవ భక్తిని పెంపొందించుకోవాలి. దైవం ఉనికి మీద ప్రజలందరికీ నమ్మకం ఏర్పడాలి. అప్పుడు వర్షాలు బాగా కురిసి క్షామం పోతుంది."

"కానీ, ప్రజలందరిలో దైవభక్తిని తక్కువ కాలంలో పెంపొందించడం అసాధ్యం. కాబట్టి మీరే ఏదైనా పరిష్కారాన్ని సూచించండి." కోరాడు రాజు. ఆయన ఆలోచించి చెప్పాడు.

"రాజధానిలో సాముహిక యజ్ఞం చేద్దాం. అక్కడికి హాజరయ్యే ప్రజల్లో కనీసం ఒక్కరికైనా దైవం మీద పరిపూర్ణ నమ్మకం వుంటేచాలు. వర్షాలు కురుస్తాయి."

ఆయన సూచించిన ప్రకారం రాజు యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేసాడు. పీఠాధిపతి స్వయంగా వచ్చి ఆ యజ్ఞాన్ని నిర్వహించాడు. వేలమంది ప్రజలు దానికి హాజరయ్యారు. యజ్ఞం పూర్తవుతున్నా వర్షపు సూచనలు లేవు. రాజు కంగారు పడ్డాడు.

"ఇంతమందిలో ఒక్కరికీ దైవం మీద, యజ్ఞం మీద నమ్మకం లేదా?' అని ఆయన అనుకుంటూండగా దూరంగా ఆకాశంలో మబ్బు తునక ఒకటి కనిపించింది. క్రమేపీ నల్లటి దట్టమైన మేఘాలు కమ్మి కుండపోతగా వర్షం కురవసాగింది. ప్రజలంతా వర్షంలో తడుస్తూ ఆనందంగా నృత్యం చేయసాగారు.

"స్వామీ! ఆ విశిష్ట దైవభక్తి గలవారెవరు?" అడిగాడు రాజు.

పీఠాధిపతి లేచి ఓ ఐదేళ్ళ పిల్ల దగ్గరకి వెళ్ళి, ఆ పాపని ఎత్తుకుని చెప్పాడు.

"ఈ పాపవల్లే మనకి వర్షం లభించింది. ఈ పాపని తగిన రీతిలో సత్కరించండి."

అన్ని వేలమందిలో భగవంతుని దయవల్ల వర్షం కురుస్తుందన్న నమ్మకంతో గొడుగుతో వచ్చింది ఆ ఒక్కపాపే!

## 13. అవతలివైపు

ఓ డాక్టర్ దైవభక్తుడు. అతను తీరిక సమయాల్లో భగవద్గీత మీద తరచూ ఉపన్యాసాలు ఇస్తూంటాడు.

అయన రోగుల్లో ఒకతను నాస్తికుడు.